# రాజుగారివి గాడిదచెవులు

పూర్వం ఒకరాజుగారుండేవారు. ఆయనకి కొన్ని వేల ఎకరాలభూమి, పెద్దకోట, బొక్కసం నిండా బోలెడు ధనం, కావలసినంత పలుకుబడి, కీర్తి ప్రతిష్ఠలు అన్నీ వున్నాయి. చక్కని చుక్క అయిన భార్య, రత్నాల్లాంటిపిల్లలు ఉన్నారు. ఇంత ఉన్నా, ఆయనకి పాపం ఒకటే విచారం. అది ఏమిటంటే ఆయన చెవులు అచ్చుగాడిద చెవులే. వాటివల్ల ఆయనకి అహోరాత్రాలు మనశ్శాంతి లేకుండా పోయింది. పగలూ, రాత్రీ ఎప్పుడూ పెద్ద తలపాగా బిగించి చుట్టుకుని చెవులు ఎవరికీ కనిపించకుండా దాచుకునేవాడు. దాస దాసీజనాలకి, మంత్రులకి, ప్రజలకి, ఆఖరికి రాణీగారికి కూడా ఆయనకి గాడిద చెవులున్నాయని తెలియదు.

కాని ఒక్కడిదగ్గిరమాత్రం ఈ రహస్యం బయటపడక తప్పలేదు. రాజుగారికి నెలకొకసారి క్షురకర్మ చేయడానికి వచ్చే మంగలికి ఈ రహస్యం తెలియకుండా ఎలా దాగుతుంది? అందుచేత రాజుగారు మంగలికి పుష్కలంగా డబ్బిచ్చి, ఈ సంగతి ఎవ్వరికీ చెప్పవద్దన్నాడు. చెబితే తలతీసేస్తానన్నాడు.

అయినా మంగలి ఎవరితోనన్నా చెప్పేస్తాడేమోనని రాజుగారికి అహర్నిశలూ బెంగపట్టుకుంది. ఎవరూ లేనప్పుడు ఆయన అద్దంలో తన ముఖం చూసుకునేవాడు. గాడిద చెవులు తమంతట తామే ఊగిసలాడి ఆయన్ని వెక్కిరించేవి. దీంతో ఆయన ముఖంలో ఎప్పుడూ విచార ముద్ర కనిపించుతూ వుండేది.

కాని రాజుగారికంటే మంగలి పడే బాధ వర్ణనాతీతం. ప్రపంచంలో ఇంకెవ్వడికీ తెలియని రహస్యం తనకొక్కడికే తెలుసు. ఎలా ఈ రహస్యం దాచడం? రోజురోజుకీ మంగలికి రహస్యం దాచడం కష్టమైపోతోంది. ఎవడన్నా అతనితో మాట్లాడుతున్నప్పుడు ఆ

సాపుగానం సరస్వతీదేవి

మాటలు వినిపించుకునేవాడు కాదు. రహస్యం చెప్పేద్దామా, వద్దా అని మాత్రమే ఆలోచించేవాడు కాని ప్రాణభయంవల్ల చెప్పలేక పోయేవాడు.

మంగలి మనోవ్యాధితో చిక్కిపోసాగాడు. పెళ్లాం మొత్తుకునేది, "ఏమిటయ్యా నీబాధ" అని.

"ఏమీ లేదులే, నీ పని నువ్వు చూసుకో" అనేవాడు మంగలి. ఇదికాదనుకుని భార్య ఒక వైద్యుణ్ణి పిలిపించి భర్తని చూపించింది. అతగాడు నాడీ అవీ పరీక్షించి ఒంట్లో జబ్బేమీ లేదని, మనస్సులో ఏదో బాధ ఉందని తేల్చాడు. ఆవైద్యుడు క్షణం తీరికలేని మనిషి గనుక ఈ మాట చెప్పి వేరే పనిమీద వెంటనే వెళ్ళిపోయాడు.

ఈ బాధ పోయేందుకు పోనీ భార్యతో చెప్పేద్దామా అనుకున్నాడు. కాని ఆడవారి నోట్లో నువ్వుగింజ నానదే. ఈ ముక్క కాస్తా ఆమె ఇంకోరితో చెబితే, ఆనోటాఆనోటాపడి అది వ్యాపిస్తుందని భయపడ్డాడు. చివరికి వైద్యుడితోనే చెప్పేద్దాం అనుకున్నాడు. అనుకుని ఆయనదగ్గిరికి వెళ్లాడు.

"ఏం పని?" అని అడిగాడు వైద్యుడు.

"నా మనస్సులోని బాధ మీకు చెప్పేస్తాను," అన్నాడు మంగలి.

"నీ బాధలు వింటూ కూర్చోడానికి నాకు తీరికలేదు. పోయి భూదేవితో మొరబెట్టుకో," అన్నాడు వైద్యుడు.

చేసేదిలేక మంగలి యింటికి వచ్చేశాడు. వైద్యుడు యాథాలాభంగా అన్నమాట అతనికి నచ్చింది. భూదేవితో చెపుదామనుకున్నాడు. ఆ రోజురాత్రి పదిగంటలప్పుడు బయలుదేరి ఊరవతల అడవిలోకి వెళ్లాడు. చీకటిగా ఉంది. ఎక్కడా జనసంచారం లేదు. పక్షులుకూడా నిద్రపోతున్నాయి. అడవి నిశ్శబ్దంగా ఉంది. మంగలి ఒంటరిగా ఒకచోట కూర్చుని, జాగ్రత్తగా, నెమ్మదిగా రహస్యం కాస్తా బయటపెట్టాడు: "రాజుగారివి గాడిద చెవులు" అని. ఇక చాలనుకున్నాడు. కాని ఇన్ని సంవత్స



# రాజుగారివి గాడిదచెవులు

రాలనుంచీ రహస్యాన్ని మోసిన బరువు తీరిపోయిందా? పోలేదు. మళ్లీ ఇంకోసారి "రాజుగారివి గాడిదచెవు"లన్నాడు. ఇక ఆపుకోలేక అదేపనిగా "రాజుగారివి గాడిదచెవులు" అని జపంచేసినట్టు అనసాగాడు. ఒకగంటసేపు అనగా అనగా అప్పటికతని బాధ తీరింది.

ఆ రోజునుంచీ అతడు పూర్వపు ఆరోగ్యం కోలుకొని దుండుముక్కలాగ తయారయ్యాడు.

కాని అతడు ఆ రాత్రి అన్న మాటలు వృథాగా పోలేదు. అతని దగ్గర్లో కొన్ని వెదురు చెట్లు ఉన్నాయి. అవి ఈ మాటలు విన్నాయి. వాటికూడా ఈ రహస్యం బరువైపోయింది. ఎప్పుడు ఎవరికి చెప్పేద్దామా అని తహతహలాడసాగాయి.

ఇట్లా ఉండగా రాజుగారి పెద్ద కొడుక్కి వివాహ మహోత్సవం ఏర్పాటు చేయబడింది. అనేకమంది రాజులు వివాహానికి వచ్చారు. పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది. హరికథా కాలక్షేపాలు, పాటకచ్చేరీలు ఏర్పాటయ్యాయి. అంతా ఆనందంలో మునిగివున్నారు.

ఆ పట్నానికి దూరంగా మరొక ఊళ్ళో ఒక గొప్ప పిల్లనగ్రోవి వాద్యగాడున్నాడు. అతడు తన విద్య రాజుగారికి చూపించి మెప్పు, డబ్బు సంపాదించాలనుకున్నాడు. బయలుదేరి వస్తుండగా ఈ ఊరి దగ్గిర వేణువనం తగిలింది. ఏపుగా నవనవలాడుతూ పెరిగిన వెదురు చెట్లు చూశాడు. పాత పిల్లనగ్రోవితో కంటె కొత్తదాంతో అయితే నాదం చాలా బాగుంటుందనుకున్నాడు. ఒక కొమ్మ విరిచి చక్కగా చెక్కి మంచి పిల్లనగ్రోవి తయారుచేశాడు. ఇది మొదటిసారిగా రాజసభలోనే వాయిద్దాం అనుకుని సంచీలో వేసుకుని, ఊళ్లోకి వెళ్లాడు.

మంత్రిగారి అనుమతి సంపాదించి వాద్యగాడు వేదికమీద కూర్చుని పిల్లనగ్రోవి మొదలుపెట్టాడు. ఊదీ ఊదగానే సంగీతానికి బదులు "రాజుగారివి గాడిద చెవులు" అని మాటలు స్పష్టంగా వినబడ్డాయి. ఇదేమిటా అనుకుని మళ్లీ ఊదాడు. ఎన్నిసార్లు ఊదినా ఇవే మాటలు బయటికొస్తున్నాయి. సభికులందరూ పొట్టలు చేత్తో పట్టు

కుని నవ్వసాగారు. అతిథులుగా వచ్చిన రాజులు, సామంతులు, మంత్రులు ప్రజలు, ఆఖరికి రాణీగారు, పెళ్లికొడుకు, పెళ్లికూతురు అంతా విరగబడి నవ్వేస్తున్నారు. రాజుగారిముఖం కందగడ్డలా జేవురించింది. సిగ్గు, అవమానం, కోపం ముంచుకొచ్చాయి వాద్యగాణ్ణి పిలిచి "ఏమిటీ ఈ దుండగం" అని గద్దించారు.

అతడు వణికిపోతూ "మహాప్రభూ! నాతప్పేమీ లేదు. ఈ పిల్లనగ్రోవి తనంతట తనే ఈ మాటలు అనేస్తోంది. ఇది మీ పట్నం దగ్గర్లో ఉన్న వేణువనం లోని చెట్టుకొమ్మతాలూకుది. ఏం మాయవల్లనో ఇది ఇలా పలుకుతోంది," అని విన్నవించాడు.

నిజమో కాదో చూద్దామని రాజుగారి ఆ వేణువు తీసుకుని ఊదాడు. మళ్ళీ అవే మాటలు వచ్చాయి.

ఇంతలో ఇదంతా గమనిస్తూ ఉన్న మంగలి గజగజలాడుతూ రాజుగారికి చేతులు జోడించి ఇలా అన్నాడు: "ప్రభూ! ఈ తప్పంతా నాది. నేను మీ చెవుల రహస్యం దాచలేకపోయాను. అర్ధరాత్రి వేళ ఊరిబయట అడవిలో ఎవరూ లేకుండా చూసి ఈ రహస్యం బైట పెట్టాను. అక్కడి వెదురుచెట్లు అది వింటాయనీ, ఇలా చెప్పేస్తాయని నాకేం తెలుసు? ప్రభువులు నన్ను కరుణించాలి."

సభికులంతా నిశ్శబ్దంగా విన్నారు. ఎవ్వరికీ నవ్వు రాలేదు. మంగలికి ఏ కఠినశిక్ష విధిస్తాడో రాజుగారు అని ప్రాణాలు ఉగ్గబట్టుకుని ఉన్నారు. అప్పుడు రాజుగారు గంభీర కంఠంతో ఇలా అన్నారు: "నువ్వు రహస్యం దాచనందుకు నిన్ను ఉరితీయవలసిందే కాని యువరాజుగారి వివాహ శుభసమయాన్ని ఇలా పాడుచెయ్యటం నాకిష్టం లేదు. అందుచేత నిన్ను క్షమించి వదిలేస్తున్నాను."

మంగలి సాష్టాంగ నమస్కారం చేసి బ్రతుకుజీవుడా అని తప్పుకున్నాడు. రాజుగారి క్షమాగుణాన్ని సభాసదులు ఏకగ్రీవంగా కీర్తించారు. ఈ గొడవలో తము కీర్తిస్తున్న రాజుగారికి గాడిదచెవులున్నాయని ఎవడికీ మనస్సులో హేళనభావం లేనేలేదు.

ఆ రాజుగారి చెవులు గాడిద చెవులైతేనేంగాక, మనస్సుమాత్రం వెన్నపూసలాంటిది కాదా?

(వేల్సు దేశపు కథ ఆధారం) ★




